క్లుప్తంగా

ఎన్నికల సంస్కరణలు ఎంతో మేలు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఐక్యవేదిక నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సంస్కరణలు దేశానికి ఎంతో మేలు చేస్తాయని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఐక్యవేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. జమిలి ఎన్నికలతో కేంద్రప్రభుత్వ చేతిలో ఎన్నికల సంఘం కీలు బొమ్మగా మారుతుందని ఆరోపించారు. జమిలి ఎన్నికలను నిరసిస్తూ నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ముంతాజ్ షహనాజ్, బీసమ్మ, శేషమ్మ, నారాయణమ్మ, నాగన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

కర్నూలు(హాస్పిటల్): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వెంకటరమణ కాలనీలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఉచితంగా ఫ్రీజర్ బాక్స్, వైకుంఠరథం అందిస్తున్నామని, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు శోభన్‌బాబు, కోశాధికారి రమణ, ప్రోగ్రాం కన్వీనర్ గోనూరు యుగంధర్‌శెట్టి, యూనిట్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పాటిల్ హనుమంత రెడ్డి, ఆత్మీయ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహా నటుడు రాజ్‌కపూర్



రాజ్‌కపూర్ గీతాలు ఆలపిస్తున్న గాయకుడు

కర్నూలు కల్చరల్: రాజ్‌కపూర్ మహా నటుడని వక్తలు అన్నారు. తొలితరం హిందీ నటుల్లో ఆయన మేటి ఎవరూ రాబోరని కొనియాడారు. రాజ్‌కపూర్ నటించిన ఆవారా, మేరా నామ్ జోకర్ వంటి సినిమాలు ప్రజాదరణ పొందాయన్నారు. రాజ్‌కపూర్ 101వ జయంతిని కర్నూలులో టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. పలువురు గాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయకులు నజీర్, సిరాజ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు 'కూటమి' మోసం

కోడుమూరు రూరల్: నోటిఫికేషన్ల పేరుతో కాలయాపన చేస్తూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి విమర్శించారు. ఆదివారం కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కారుమంచి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కర్నూలులో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగే ర్యాలీ, సభలో యువత భారీగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడ్, నాయకులు సిద్ధు, శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి, వీరాంజనేయులు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

31లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, హుసేనాపురం, నన్నూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఖాతాదారులు ఈ నెల 31వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని ఆయా సంఘాల సీఈఓలు మద్దిలేటి, మాలిక్‌బాషా, సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ పథకాలు వర్తిస్తాయని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాలను విస్తరించండి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామాలలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని అంగన్‌వాడీ కేంద్రాలను విస్తరించాలని గ్రామ నాయకులు విజయుడు, విశ్వేశ్వరరెడ్డి, ఖాజామియా ఆదివారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో ఏళ్ల తరబడి జనాభా పెరుగుతున్న ఇప్పటి వరకు ఏడు అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రమే ఉన్నాయన్నారు. పదేళ్లుగా నన్నూరు శివారు ప్రాంతాలలో రాగమయూరి కాలనీలో సుమారు 600 నివాసాలు ఉండగా 2,500 మంది జనాభా ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాగమయూరిలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

మిగిలింది 'ఏడు'పే!

- ఏడు నెలలుగా నిధులివ్వని రాష్ట్ర ప్రభుత్వం
- గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై శీతకన్ను
- మున్సిపల్ సముదాయాలు, స్ట్రీట్ మార్కెట్‌లపై పర్యవేక్షణ కరువు
- రోడ్డెక్కిన వ్యాపారులు... తప్పని తిప్పలు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు



వినాయక్ ఘాట్ వద్ద వెలవెలబోతున్న స్ట్రీట్ మార్కెట్



వెంకటరమణ కాలనీలో నిర్మించిన కేఎంసీ ప్రైడ్ కాంప్లెక్స్‌లో భర్తీ కానీ మున్సిపల్ షాపులు

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా నిధులు ఇవ్వడంలో ఇష్టం చూపడం లేదు. దీంతో నగరంలో అభివృద్ధి పనులకు గ్రహణం పట్టుకుంది. చిరు వ్యాపారులకు కష్టం తప్ప ఎలాంటి చేయూత లభించడం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. ప్రత్యేక నిధుల ఊసే కరువైంది. ఇప్పటికే రూ. కోట్లు ఖర్చు చేసిన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లకు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిధులు లేక నగరంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు.

ఆదాయమేదీ?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నగరపాలక సంస్థకు ఆదాయం పెంచే దిశగా పలు చర్యలు చేపట్టింది. రూ. 8 కోట్లు వెచ్చించి వెంకటరమణ కాలనీలో కేఎంసీ ప్రైడ్ పేరుతో మున్సిపల్ కార్పొరేషన్ షాపుల సముదాయాన్ని ఏర్పాటు చేసింది. అశోక్ నగర్, వెంకటరమణ కాలనీ, రామలింగేశ్వర్ నగర్ .. ఇలా అనేక కాలనీల్లో 62 షాపులను నిర్మించగా ఇప్పటికే 22 దుకాణాలను వివిధ వ్యాపారులు బాడుగకు తీసుకున్నారు. దీంతో నగర పాలక సంస్థకు ఆదాయం వస్తోంది. మిగతా దుకాణాలను వ్యాపారులకు ఇవ్వడంపై ప్రస్తుత ప్రభుత్వం ఉత్సాహం చూపడం లేదు. దీంతో నగరపాలక సంస్థకు ఆదాయం తగ్గిపోతోంది.

➤ గతంలో నగరంలోని బిర్లా సర్కిల్ సమీపంలో రూ. కోటి ఖర్చు చేసి రెస్టారెంట్, పిల్లలు ఆడుకునేందుకు ఉయ్యాళ్లు, జంపింగ్, జిమ్ పరికరాలు, పార్కు, సెల్ఫీ పాయింట్ వంటి అనేక సదుపాయాలు కల్పించారు. అయితే ఏడు నెలల క్రితం ప్రభుత్వం మారడం, వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో ఆదరణ తగ్గుతోంది. వీటిని మునిసిపల్ అధికారులు క్రమంగా పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

➤ నగరంలోని వినాయక్‌ఘాట్, ఐటీసీ సర్కిల్, వాల్ మార్టు ఎదురుగా రూ.30 లక్షలు వెచ్చించి స్ట్రీట్ మార్కెట్లను ఏర్పాటు చేశారు. ఎక్కడ పడితే అక్కడ వీధి వ్యాపారులు రోడ్లకు అడ్డంగా రాకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వీటిని కొంత కాలం విజయవంతంగా నిర్వహించారు. పాత బస్టాండ్‌లో గత ప్రభుత్వం పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడంతో నగరపాలక సంస్థకు ఆదాయం పెరిగింది. ఇక్కడ ప్రతి రోజు రూ.5 లక్షలకు పైగా వ్యాపారం నిర్వహించే వారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఏడు నెలల నుంచి ఈ పెట్రోల్ బంకుపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. ఇక్కడ కనీసం 12 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉంది. అయితే ఐదుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. దీంతో పెట్రోల్ బంకు నుంచి నగరపాలక సంస్థకు ఆదాయం తగ్గింది. సమస్యను పరిష్కారించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

రోడ్డెక్కిన వ్యాపారులు

గత ప్రభుత్వంలో వీధి వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన స్ట్రీట్ మార్కెట్‌లపై మునిసిపల్ అధికారుల పర్యవేక్షణ కరువైంది. వాటిని తెరవకపోవడంతో వీధి వ్యాపారులు తిరిగి కేసీ కెనాల్ ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో మళ్లీ ట్రాఫిక్ సమస్య వస్తోంది. నెల రోజులుగా ఈ సమస్య తీవ్రమైంది. గత ప్రభుత్వంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన స్ట్రీట్ మార్కెట్‌లు కాస్తా నిరుపయోగంగా మారే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజలు, వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికార యంత్రాంగం పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పైగా ఇటీవల ఎక్కడ పడితే అక్కడ బంకులు వెలుస్తున్నాయి. రద్దీ ప్రాంతంలో మున్సిపల్ స్థలం ఆక్రమించి సీ.క్యాంపు సెంటర్‌లో టీడీపీ కార్యకర్తలు ఆరు షాపులు ఏర్పాటు చేశారు. ఇక అదే దారిలోనే మున్సిపల్ స్కూల్ వద్ద అక్రమంగా దుకాణాలు వెలుస్తున్నాయి. మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక టీడీపీ నేతల ఒత్తిళ్లు ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి.



నగరపాలక సంస్థ కార్యాలయం



కేసీ. కెనాల్ ఫుట్‌పాత్‌పై మళ్లీ ప్రారంభమైన వ్యాపారం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు (టౌన్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటల నుంచి నగరపాలక కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ కాలనీల్లోని సమస్యలను నగర ప్రజలు ఫిర్యాదుల రూపంలో కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో అర్జీదారులు హాజరు కావాలని సూచించారు.

3న హాకీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): సబ్ జూనియర్ బాలురు, బాలికల విభాగంలో హాకీ ఎంపిక పోటీలు స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జనవరి 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు హాకీ కర్నూలు సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలురు, బాలికలు 2009 జనవరి1 వ తేదీ తరువాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. ప్రతిభ చాటిన వారు జనవరి 17 నుంచి 19 వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించనున్న హాకీ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కల్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ ఆవిర్భావ శతదినోత్సవాన్ని ఆదివారం శ్రీరామచంద్ర నగర్‌లో కల్లూరు అర్బన్ వార్డుల సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు ప్రజలపై రూ.15వేల కోట్లు భారం వేశారన్నారుఏ. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, గిడ్డయ్య ఆచారి, రామాంజనేయులు, రబియా, నూర్జహాన్, మరియమ్మ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'సప్తాహం'





ప్రవచనం చెబుతున్న రఘునందన సేవక్ ప్రభు దాస్, ప్రత్యేక పూజలు, పారాయణంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: ధనుర్మాస పూజల్లో భాగంగా గత వారం రోజులుగా కర్నూలు నగర శివారులోని గోదా గోకులంలో నిర్వహిస్తున్న అఖండ విష్ణు సహస్రనామ పారాయణ సప్తాహం కార్యక్రమం ఆదివారం ముగిసింది. వందలాది మంది గోదా గోకులం పరివారం పూజల్లో పాల్గొని పారాయణం చేశారు. వేద పండితులు శాస్త్రోక్తంగా రంగనాథ, గోదా దేవిలకు పూజలు నిర్వహించారు. హోమాలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు కన్నుల పండువలా జరిగాయి. గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్ట్ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత తరగతులు..

భగరీథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ్, బలదేవ్ సుభద్ర దేవతా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నాపరాతి పరిశ్రమను కాపాడుకుందాం

- బేతంచెర్ల నగరపంచాయతీ చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల: నాపరాతి పరిశ్రమను కాపాడుకోవడానికి పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యమై పోరాటాలకు సిద్ధం కావాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, పరిశ్రమల యజమానులు బుగ్గన చంద్రారెడ్డి, ముర్తుజావలీ, తెలుగు రమణ, మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి అన్నారు. నాపరాతి గనులకు పాత పద్ధతిలోనే రాయల్టీలు మంజూరు చేయాలని పరిశ్రమ యజమానులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం 3వ రోజుకు చేరుకుంది. గనులు, పరిశ్రమలు, లారీ, ట్రాక్టర్ యజమానులతో పాటు డ్రైవర్లు, కార్మికులు రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్నారు. వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాపరాతి పరిశ్రమ బతికి బయటపడాలంటే తప్పనిసరిగా పాత పద్ధతిలోనే రాయల్టీలను మంజూరు చేయాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు ఇక్కడి పరిస్థితులను తెలుసుకుని నాపరాతి పరిశ్రమను బతికించాలని కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో నాపరాయి పరిశ్రమపై 18 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారని గుర్తు చేశారు. ప్రత్యక్షంగా 15 వేల నుంచి 20 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. పరిశ్రమల యజమానులు నాగేశ్వరెడ్డి, మోహన్‌రావు, రాంబాబు, తిరుమలేశ్వర్ రెడ్డి, ఎర్రబాషా, ఉపేంద్ర, శ్లేషావలి చౌదరి, మురళీ, బాబు పాల్గొన్నారు.

బెస్తలు అన్ని రంగాల్లో రాణించాలి

- మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బెస్త శ్రీనివాసులు ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న బెస్త గ్యాస్ శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): విద్య, ఉద్యోగ, రాజకీయ, ఉపాధి తదితర అన్ని రంగాల్లో సంప్రదాయ మత్స్యకారులైన బెస్తలు రాణించాలని జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉల్లిందకొండ శ్రీనివాసులు అన్నారు. స్థానిక బీసీ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా నగరానికి చెందిన బెస్త గ్యాస్ శ్రీనివాసులను ఎంపిక చేసి నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఉల్లిందకొండ శ్రీనివాసులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచిపోయినా..బెస్తలకు రాజకీయ వాటాలను కల్పించడం లేదన్నారు. జిల్లా నూతన అధ్యక్షుడు గ్యాస్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలోని బెస్తలను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. రాయలసీమ ఇన్‌చార్జ్ మిడుతూరు శ్రీనివాసులు, నాయకులు బెస్త శేషన్న, వెంకటేష్, రాధాకృష్ణ, పరమేష్, సత్యనారాయణ, నాగరాజు, నందకిషోర్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్‌కు తాళం



కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్‌కు తాళం వేసిన ఉన్న దృశ్యాలు

కోడుమూరు రూరల్ : స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌కు ఆదివారం ఉదయం సిబ్బంది తాళం వేశారు. ఉదయం 11గంటల ప్రాంతంలో ఎక్సైజ్ స్టేషన్‌కు ఏకంగా తాళం వేసుకుని సిబ్బంది అంతా బయటకు వెళ్లిపోయారు. సీఐ మంజుల, ముగ్గురు కానిస్టేబుళ్లతో కలిసి వెల్దుర్తిలో తనిఖీల నిమిత్తం వెళ్లారు. ఈ సమయంలో ఎస్ఐతో పాటు, మరో కానిస్టేబుల్ డ్యూటీలో ఉన్నారు. అయితే వీరు సైతం ఏదో పనిపై వెళ్లాల్సి రావడంతో ఏకంగా స్టేషన్‌కు తాళంవేసినట్లు సమాచారం. సుమారు 30నిమిషాల పాటు స్టేషన్‌కు తాళం వేసివుండటాన్ని గమనించి ఎక్సైజ్ సీఐ మంజులు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. సిబ్బంది తనిఖీల నిమిత్తం వెళ్లారని, కాసేపట్లో వస్తారన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): క్రీడల్లో పాల్గొనే విద్యార్థులందరికీ క్రమశిక్షణ వస్తుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు క్లబ్‌లోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, తైక్వాండో సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం..

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ప్రదానం చేశారు. క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.

'ఆరోగ్యశ్రీ'కి మంగళం పాడే కుట్ర

ఆదోని టౌన్: ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షులు నాగరాజు ఆరోపించారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పేద వారికి ఉచిత వైద్యసేవలు అందించేందుకు దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టారన్నారు. ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేసిందన్నారు. గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని గుర్తు చేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి మంగళం పాడేలా చేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయకుండా పథకాన్ని నిర్వీర్యం చేసే యోచనలో ఉందన్నారు. అంతే కాకుండా తాజాగా ఆరోగ్య బీమా అమలు చేస్తామని చెప్పడం దీనికి బలానిస్తోందని చెప్పారు. దీంతో పేదవాడికి మెరుగైన వైద్యం అందే పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పేదలకు ఉపయోగపడే పథకాన్ని సక్రమంగా అమలయ్యేలా చూడాలని కోరుతున్నారు.

12న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆదోని అర్బన్: కర్నూలులోని యాదవ హాస్టల్‌లో జనవరి 12వ తేదీన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు పోలకల్ నాగేశ్వరరావు, యనకండ్ల శ్రీనివాసులు, చెన్నుపాడు రామకృష్ణ, కె.వెంకటాపురం వీరభాస్కర్, చింతమానుపల్లి గోవిందు, లింగందిన్నె ఈశ్వరయ్య తెలిపారు. ఆదోనిలోని ఓ హోటల్‌లో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలులోని యాదవ్ హాస్టల్‌లో దాదాపు 500 మంది వరకు చదువుకున్నామన్నారు. చదువుకున్న వారంతా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డారని చెప్పారు. స్నేహితులందరూ కలిసి అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకునేందుకు కర్నూలులోని యాదవ్ హాస్టల్‌లో ఏర్పాటు చేసే ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో బీసీలకు పెద్దపీట



వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌ను కలసిన రాఘవేంద్ర నాయుడు, నాయకులు

- నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాఘవేంద్ర నాయుడు ఆదివారం కల్లూరులోని కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహంలో పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులను కలిశారు. మర్యాద పూర్వకంగా శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లాల అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాఘవేంద్ర నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆశీస్సులతో పార్టీ బీసీ విభాగాన్ని బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షులు శివారెడ్డి, నాయకులు షరీఫ్, శీను, అంజి, లాజర్, నరసింహారెడ్డి, రంగన్న, భాస్కర్, మున్నీర్, జగదీష్‌రెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ



విజేతలుగా నిలిచిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీకి చెందిన ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు డబుల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం పోటీలు ముగిశాయి. సీనియర్ ప్లేయర్స్, పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఓపెన్ కేటగిరీలో విజయరాజు, ఇమ్మానియేలు (మొదటి), కౌశిక్, తరుణ్ (రెండవ), సాయినాథ్ పాల్ (మూడవ) స్థానంలో నిలిచారు. 35 సంవత్సరాల పైబడిన కేటగిరీలో శ్రీకాంత్, రామకృష్ణ (మొదటి), బాషా, అనిల్ (రెండవ), రషీద్, అను (మూడవ) స్థానాల్లో నిలిచారు. ఎయిర్‌పోర్టు సీఐ శంకర్ విజేతలకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవికుమార్, మోహన్, శేఖర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌కు అభినందన



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌కు ట్రాక్ షూట్‌ను అందజేస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ఖ్యాతిని దేశ రాజధాని ఢిల్లీ వరకు చేర్చిన వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ ఎ.కె.హర్షవర్ధన్‌ను వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ప్రశంసించారు. గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగే పరేడ్‌కు ఎంపికైన హర్షవర్ధన్‌కు ఆదివారం వర్సిటీ తరఫున ట్రాక్‌సూట్‌ను ఇన్‌చార్జ్ వీసీ బహూకరించారు. నగరంలోని సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాలకు చెందిన ఈ విద్యార్థి ఈనెల 30న ఢిల్లీకి బయలు దేరి వెళ్లనున్నాడని వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి. నాగరాజు పేర్కొన్నారు. జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌తో పాటు ఫిబ్రవరి మొదటి వారం వరకు జరిగే వివిధ కార్యక్రమాల్లో హర్షవర్ధన్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై పోలీసుల దాడి దారుణం

- పోలీస్ అధికారులను సస్పెన్షన్ చేయాలి
- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ఎం. ప్రభాకర్

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీస్ అధికారులు దాడి చేయడం దారుణంగా ఉందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ఎం ప్రభాకర్ అన్నారు. అన్నమయ్య జిల్లా గాలివీడులో ఈ నెల 28న మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, సీనియర్ న్యాయవాది జల్లా సుదర్శన్‌రెడ్డిపై దాడి చేసిన సీఐ కొండారెడ్డిని, సివిల్ కేసులో అనవసరంగా పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వేధించి సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతికి కారణమైన అనంతపురం 3వ పట్టణ సీఐ శాంతిలాల్‌ను సస్పెండ్ చేయాలన్నారు. న్యాయవాదులపై పోలీస్ అధికారులు దాడులు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై దాడులను ప్రభుత్వమే ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడిన పోలీస్ అధికారులపై కేసులు నమోదు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. న్యాయవాదుల హక్కులకు భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్న పోలీస్ అధికారులపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. తాజాగా జరిగిన ఈ రెండు సంఘటనలపై పూర్తి స్థాయిలో న్యాయ విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

సీఐ శాంతిలాల్‌ను సస్పెన్షన్ చేయాలి

– వాల్మీకి, బహుజన సంఘాల జిల్లా నేతలు డిమాండ్

అనంతపురంలో సీనియర్ న్యాయవాది వాల్మీకి శేషాద్రి మృతికి కారణమైన 3వ పట్టణ సీఐ శాంతిలాల్‌ను, సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని వాల్మీకి, బహుజన సంఘాల జిల్లా నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు చంద్రచెర్ల హరి, వాల్మీకి బోయ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తలారి కృష్ణనాయుడు, వాల్మీకి సీనియర్ నాయకులు, న్యాయవాది మద్దిలేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓ సివిల్ కేసు విషయంలో సీఐ శాంతిలాల్ పలుమార్లు విచారణ చేసి, స్టేషన్‌కు పిలిపించి దుర్భాషలాడటంతో న్యాయవాది వాల్మీకి శేషాద్రి పోలీస్‌స్టేషన్‌లోనే మృతి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండ్ల శేఖర్, రవిశంకర్ నాయుడు, గోపాల్, శంకర్, మండ్ల మధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాల్మీకి, బహుజన నాయకులు